నాడు-నేడు పనులు పూర్తయ్యేదెప్పుడో!

- ఎస్టీవీఆర్ పాఠశాలలో నిలిచిన నాడు–నేడు పనులు
- తరగతి గదులు సరిపోక అవస్థల్లో విద్యార్థులు



ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల పాత భవనం

మధురానగర్(విజయవాడ(సెంట్రల్): దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఈ పాఠశాలలో 564మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. గతేడాది పదోతరగతి పరీక్షలలో ఈ పాఠశాల విద్యార్థి డీ భవానీశంకర్ 594 మార్కులతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచాడు. పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సైతం సాధించి సత్తాచాటారు. అయితే ఈ పాఠశాల విద్యార్థులకు సరైన వసతులు కల్పించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో తగిన వసతులు లేక ఎస్టీవీఆర్ పాఠశాల విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు .

పూర్తికాని తరగతి గదుల పనులు..

గత ప్రభుత్వ హయాంలో నిరుపేద, పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వీరికి అవసరమైన తరగతి గదులు, ఇతర మౌలికవసతులు ఏర్పాటు చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద రూ.3కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాలలో అవసరమైన మరమ్మతులతోపాటు 18 తరగతి గదులు, 10 మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రెండు కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అదనపు తరగతి గదుల భవనాలకు గానూ ఒక్కో భవనానికి రెండుఅంతస్తుల వరకు శ్లాబులు వేశారు. మూడో అంతస్తుకు శ్లాబు వేసేందుకు ఓ భవనానికి సెంట్రింగ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇంతలో ఎన్నికలు రావడం, ఇసుక సమస్య, మేస్త్రితో నెలకొన్న సమస్యలతో సదరు కాంట్రాక్టర్ శ్లాబ్ పనులు నిలిచిపోయాయి. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ నాడు–నేడు పనులను పట్టించుకునే వారే కరువయ్యారు.



మధ్యలో నిలిచిన పాఠశాల భవనం పనులు



అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల పనులు

తుప్పపట్టిన ఐరన్..



పూర్తికాని శ్లాబు పనులు

సుమారు నాలుగు నెలలపాటు సెంట్రింగ్‌ను అలాగే వదలివేశారు. ఇటీవల సెంట్రింగ్ మేస్త్రి సెంట్రింగ్ సమాన్లు తీసుకుని వెళ్లిపోయారు. శ్లాబ్ కోసం ఏర్పాటు చేసిన ఇనుము నెలల తరబడి ఎండకు ఎండి వర్షానికి తడుస్తూ తుప్పుపట్టి పాడవుతోంది. సుమారు 6 నెలలుగా ఇక్కడ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రధానోపాధ్యాయురాలు శ్లాబ్‌లు వేసిన తరగతి గదులలో పిల్లలు కూర్చోనేందుకు వీలుగా సరిచేయించారు. అయితే వందలాది మంది పేద విద్యార్థులు విద్యనభ్యసించే పాఠశాలకు మౌలికవసతులు సమకూర్చే విషయంలో అధికారులు తీవ్రనిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. దీంతో పూర్తికాని భవనాల్లోనే విద్యార్థులను కూర్చొబెట్టి పాఠాలు బోధించాల్సిన దుస్థితి ఇక్కడ నెలకొంది. ఇకనైనా అధికారులు స్పందించి నాడు–నేడు పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయించి తగిన వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాకారుల ఐక్యతా రాగం



ఐక్యతా రాగం వినిపిస్తున్న కళాకారులు కళా సంస్థల సభ్యులు

విజయవాడ కల్చరల్: కళాకారుల సమస్యల పరిష్కారానికి అమరావతి సాంస్కృతిక, కళారంగాల ఐక్యవేదిక కృషి చేస్తోందని ఆసంస్థ క్రియాశీలక సభ్యుడు కే డేవిడ్ రాజు తెలిపారు. సంస్థ అధ్యర్యంలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల కళాకారులు, సాంస్కృతిక ప్రతినిధులు వాయిద్య కళాకారుల సమావేశం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డేవిడ్ రాజు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు కళాకారుల మధ్యవిబేధాలు సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారి బారినుంచి కళాసంస్థల పరిరక్షణకు కార్యచరణను రూపొందించినట్లు వివరించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధి విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి త్వరలో నగర పోలీస్ కమిషనర్, భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించనున్నట్లు వివరించారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులు కంచి మల్లీశ్వరి, బోడి ఆంజనేయరాజు, జానపద గాయకుడు డాక్టర్ దామోదర గణపతిరావు, చింతకాయల చిట్టిబాబు, దూపాటి శ్రీదేవి, కారుమంచి రాజు, మాంతి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తులు శరాబందీరావు అమ్మవారికి కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, దీక్షాస్వాములు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఓటు నమోదు కార్యక్రమం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని రాష్ట్ర పూర్వపు లా సెక్రటరీ సి.దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక మధురానగర్ ఓంకార క్షేత్రం షిర్డీసాయిబాబాబా మందిరం సమీపంలోని చేయూత కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు ఉచిత అవగాహన సేవలు అందిస్తున్న చేయూత సంస్థ నిర్వాహకులు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్‌రాజులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ న్యాయమూర్తి నేలపూడి చిరంజీవి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ కోట రామచంద్రరావు, గోళ్ళ నారాయణరావు, ప్రభుత్వ సంగీత కళాశాల సూపరిండింటెంట్ జేఎస్ దక్షిణామూర్తి, చిన్ని నాగేశ్వరరావు, బీ ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు

వెలమ సంఘం ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేశారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయం వద్ద వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఘంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం తరపున ప్రతి నెలా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. 50 మందిని గుర్తించి క్రమం తప్పకుండా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిరిపురపు కిరణ్ కుమార్, కోశాధికారి ఘంటా శ్రీనివాసరావు, మల్లేశ్వరి, కొప్పిశెట్టి సీత రామరావు, నల్ల రామారావు, గొట్టపు గోవర్ధరావు, సంబంగి దుర్గారావు, మూకల గణేష్ నాయుడు, బొడ్డు విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): వరద ప్రభావిత ప్రాంతాల్లోని 30మంది విద్యార్థులకు ఆర్కా ఫౌండేషన్(విశాఖపట్నం)వారు పాయకాపురం అగ్నిమాపక కేంద్రం అధికారి షేక్ ఘని, లీడింగ్ ఫైర్‌మేన్ ఎ.శరణ్ కుమార్, ఎస్‌కె.బాజీ చేతుల మీదుగా నోటు పుస్తకాలు, విద్యా కిట్లను పంపిణీ చేశారు. పాయకాపురం అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బందిని ఆర్కా ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు యల్లపు నగేష్, ప్రసాద్, అంబటి శ్రీను, నవీన్ కుమార్, కారి దుర్గా, కోన జగదీష్, పైలా గోవింద్, అరుణ్ పాల్గొన్నారు.

విజయదుర్గా ఆలయంలో విశేష హోమాలు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం విశేష హోమాలను నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గణపతికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మల పర్యవేక్షణలో సంకట హర గణపతి హోమం నిర్వహించారు. హోమంలో ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

వృద్ధులకు నిత్యావసరాలు అందజేత



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మేకా వెంకటసుబ్బారావు, ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డెప్యూటీ గవర్నర్ మేకా వెంకట సుబ్బారావు సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా క్రమం తప్పకుండా వృద్ధులకు నాణ్యమైన నిత్యావసరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సేవలను అభినందించారు. ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌ఛైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ తాము దాతలు, ట్రస్టీల సహకారంతో వృద్ధులకు ప్రతీ నెల ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. ట్రస్ట్ సభ్యులు మధుసూదనరావు, లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సబ్‌స్టేషన్ సాయిబాబా కాలనీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ పి.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురానగర్ మెయిన్ రోడ్డు సాయిబాబా కాలనీ ఒకటి లైన్ నుంచి ఆరోలైన్ వరకు విద్యుత్ సరఫరా నిలిచివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

వేలాది మందికి అన్నదానం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. పండుగలను కలిసి మెలసి జరుపుకోవాలని అన్నారు. ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో పూజిస్తే సకల కష్టాలు తీరి సుఖసంతోషాలు లభిస్తాయన్నారు. అనంతరం 8వేల మందికి అన్నదానం జరిగింది. స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి, నిర్వాహకులు గద్దే శ్రీను, శేషుబాబు, నూతక్కి శ్రీను, చెరుకుపల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సత్యనారాయణరాజు సేవలు శ్లాఘనీయం



దాట్ల సత్యనారాయణరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ప్రధాన కార్యదర్శిగా, అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఉపాధ్యక్షులుగా దాట్ల సత్యనారాయణరాజు అందించిన సేవలు నిరుపమానమని పలువురు వక్తలు కొనియాడారు.

స్థానిక ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయంలో ఆదివారం దాట్ల సత్యనారాయణరాజు సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరాజు, గ్రంథాలయం అధ్యక్షులు కె.సుబ్బరాజు మాట్లాడుతూ సత్యనారాయణరాజు అందించిన సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు, పీ వీ సుబ్బరాజు, వెంకమరాజు, కెఎస్ ప్రసాదరాజు, అడ్వకేట్ ఎస్.సుధాకర్‌రావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహణ



మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళా వికాస్ ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో ఆదివారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీ ఉషారాణి, డాక్టర్ కె.ఝాన్సీరాణి మాట్లాడుతూ 40ఏళ్ల దాటిన ప్రతీ మహిళ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించటంతోపాటు క్యాన్సర్‌ను ఆరంభ దశలోనే గుర్తించేందుకు తాము వికాస్ ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా ఉచిత క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సమన్వయకర్త పి.రుక్మిణి, సత్యనారాయణపురం కో ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్వాలిటీ వాక్



ఎంజీ రోడ్డులో క్వాలిటీ వాక్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఐఎస్ ఆధ్వర్యాన ఆదివారం నగరంలో ఉత్సాహంగా క్వాలిటీ వాక్ నిర్వహించారు. అవర్ షేర్డ్ విజన్ ఫర్ ఎ బెటర్ వరల్డ్–సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ 9 ఇండస్ట్రీ, ఇన్నోవేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పై ఎంజీ రోడ్డులో వాక్‌థాన్ చేపట్టారు. ఈ వాక్‌లో వినియోగదారుల సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, విద్యార్థులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ ఎం.రమాకాంత్, డెప్యూటీ డైరెక్టర్ వివేక్‌వర్ధన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ భావనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రలత గ్రంథాల ఆవిష్కరణ



చంద్రలత రచనలను ఆవిష్కరిస్తున్న బాలాంత్రపు ప్రసూన, సత్యవతి, వేదికపై రాజగోపాల్, మాధవరావు, చంద్రలత

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి రచయిత్రి చంద్రలత అని విద్యావేత్త బండ్లమాధవరావు అన్నారు. సాహితీమిత్రులు సాహిత్యవేదిక ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా స్కూల్‌లో చంద్రలత రచించిన గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మాధవరావు మాట్లాడుతూ రచయిత చంద్రలత నిరంతర అధ్యయన శీలిగా అభివర్ణించారు. సమాజంలో అనేక అంశాలు ప్రభావితం చేశాయని వాటికి ఆమె అక్షర రూపమిచ్చినట్లు తెలిపారు. గతంలో ఆమె రచించిన గ్రంథాలకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందన్నారు. కథ, కవిత్వం, విమర్శ, అనువాద రంగంలో ఆమె అందెవేసిన చెయ్యి అని కొనియాడారు. చంద్రలత రచించిన ఆయువు పాట గ్రంథాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పీ సత్యవతి, నీలపురాణి గ్రంథాన్ని బాలాంత్రపు ప్రసూన, అనువాద గ్రంథం ది క్రాకెడ్ గ్లాస్ జార్ అండ్ అదర్ స్టోరీస్ డాక్టర్ సీఎల్ఎల్ జయప్రద ఆవిష్కరించారు.చినుకు రాజగోపాల్ గ్రంథాలను పరిచయం చేశారు. రచయిత్రి చంద్రలత తనను ప్రభావితం చేసిన అంశాలను, రచనకు సహాయనడిన వివరాలను వివరించారు. యువకవి అనిల్ డ్యానీ, సాహితీమిత్రులు సాహిత్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

చైతన్యవేదిక జాతీయ మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న ఘంటసాల చైతన్య వేదిక సభ్యులు కోట వెంకటేశ్వర్‌రెడ్డి

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో మహనీయుల స్ఫూర్తి చిహ్నాల ఏర్పాటుకు పాలకులు కృషి చేయాలని ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక రెండురోజుల పాటు నిర్వహించే 13వ జాతీయ మహాసభలు గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం వేదికపై ఆదివారం ప్రారంభమయ్యాయి. సభలను ప్రారంభించిన చైతన్య వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాలలో ఘంటసాల స్మారక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన విధంగానే అమరావతిలోనూ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, సమావేశంలో చైతన్యవేదిక సభ్యులు కేవీ ప్రసాద్, నారాయణరావు, శంకర్ డేవిడ్‌రాజు, గోళ్ళ నారాయణరావు, బోడి ఆంజనేయరాజు. పరుచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై పలువురు కళాకారులు ఆలపించిన కర్ణాటక సంగీత విభావరి భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై అయ్యదేవర సింధూజ, సిరి చందన, పద్మప్రియలు పలు కీర్తనలను ఆలపించారు. సంగీత కచేరిని పలువురు భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

రోడ్డు భద్రతపై సైకిల్ ర్యాలీ

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ 1964లో స్థాపితమై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదివారం మొగల్రాజపురంలోని అమ్మ కల్యాణ మండపం దగ్గర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అమ్మ అసోసియేషన్ వివిధ రూపాల్లో అవగాహన కల్పించటం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. అమరావతి రన్నర్స్, అమ్మ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ రోడ్డు భద్రతా సైకిల్ ర్యాలీలో ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రవికుమార్, అమ్మ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు జి.వి. సుబ్బారావు, జి.సతీష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం ప్రభుత్వ బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేయాలని సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సోషల్ జస్టిస్ ఫోరం పక్షాన లేఖను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలులో సామాజిక అన్యాయం, సామాజిక అసమానతలు ఉన్నాయన్నారు. ఏపీ వర్గాలకు సామాజిక అన్యాయం జరుగుతుందో శాస్త్రీయమైన గణాంకాలు తయారుచేశామన్నారు. ఈ గణాంకాలను ప్రభుత్వానికి అందజేస్తామని వివరించారు. వీటిపై కేబినెట్ సమావేశంలో చర్చ జరపాలని కోరారు. ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ సామాజిక అసమానతలపై పరిశీలన జరపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని, ఇది ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో సోషల్ జస్టిస్ ఫోరం నాయకులు కె హరినాథ్, దానాగౌడ్ పాల్గొన్నారు.

స్వరపేటిక క్యాన్సర్‌కు అరుదైన చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): తీవ్రస్థాయి స్వరపేటిక క్యాన్సర్‌కు గురైన 47 ఏళ్ల రోగికి అరుదైన చికిత్సతో స్వస్థత చేకూర్చినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ ఇషాంత్ అయినపూరి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరానికి చెందిన సాంబశివరావు స్వరపేటిక క్యాన్సర్ నిర్ధారణ తర్వాత తొమ్మిది నెలల పాటు కీమోథెరపీ చేయించుకుని, అత్యంత సంక్లిష్టమైన పరిస్థితిలో చికిత్స కోసం తమ ఆస్పత్రికి వచ్చారని డాక్టర్ ఇషాంత్ పేర్కొన్నారు. రోగి అనేక ఆరోగ్య సమస్యలతో రావడంతో శస్త్రచికిత్సను అత్యంత నైపుణ్యంతో విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. వాయిస్ బాక్స్‌ను తొలగించడంతో పాటు మెడకు రెండు వైపుల నుంచి శోష రసకణువులు, చుట్టుపక్కన కణజాలాన్ని చికిత్సలో భాగంగా తీసి వేశామన్నారు. ప్రస్తుతం రోగి గాయం పూర్తిగా నయమైందని, స్పీచ్ ఫంక్షన్‌ను పునరుద్ధరించేందుకు వాయిస్ ప్రొస్థెసిస్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనేక ఆరోగ్య సమస్యలు, సంక్లిష్టమైన సమస్యను సమర్థవంతంగా అధిగమించామని చెప్పారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సేవలు అభినందనీయం



వరద బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న బొమ్మసాని, సంస్థ సభ్యులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): వరద బాధితులకు అండగా నిలుస్తూ పండిట్ రవిశంకర్ గురూజీ నేతృత్వంలోని ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు కొనియాడారు. ఇటీవల సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన భవానీపురం కరకట్ట ప్రాంత వాసులకు ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో భవానీఘాట్‌లోని సాయి అన్న గార్డెన్‌లో ఆదివారం నిత్యావసర సరుకులు, దుస్తులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. సంస్థ ఎపెక్స్ కమిటీ సభ్యులు రవికిరణ్, సభ్యులు కొల్లి ఏకాంతరావు మాట్లాడుతూ గత నెల రోజులుగా తమ సంస్థ ఆధ్వర్యంలో వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు సాయం అందజేస్తున్నామన్నారు. నవంబర్ 13న భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని బబ్బూరి గ్రౌండ్‌లో మహాసత్సంగ్ పేరుతో వరద బాధితులతో కలిసి నిర్వహించనున్న ఆత్మీయ సమావేశంలో పాల్గొనాలని కోరారు.